# కొత్తపుంతలు

(ప్రచురణ- 1954)

— అవసరాల సూర్యారావు




ఊళ్ళో చుట్టల దుకాణాలన్నీ మూసేశారు. చుట్టలు కాల్చేవాళ్ళకి మహా ఇబ్బందిగా వుంది. పనివాళ్ళంతా కట్టు కట్టి ఊరేగింపులు చేస్తున్నారు. సభలు జరుపుకుంటున్నారు.

చుట్టల్లేక దవడ పీక్కుపోతున్నది. కాలేజి లెక్చరరుగారు గంటకి నాలుగు చుట్టలు పెసరకాయల్లా 'ఉఫ్‌స' ఊదేస్తారు. ప్లీడరుగారికి రోజుకో అరపాతిక చుట్టలు 'మింజుమలె' అవుతాయి. ఆయన సిగరెట్టుతోనే సరిపెట్టుకుంటున్నారు; వంటకి భార్య లేకపోతే వంటమనిషితోనే సరిపెట్టుకుంటున్నట్టు. సిగరెట్లు ఆటి రావడంలేదు. ఇలాయితే ఏం దారి? వంటమనిషి పోపులికి నూనె దుబారా చేస్తోంది. కట్టెలు పట్టెడు తెస్తే పట్టుమని వో పూట రాకుండా వున్నాయి. లెక్చరరుగారి బీడీకి తన సిగరెట్టు ముట్టించి 'అసలీ సమ్మె ఎందుకు వచ్చిందాని....ఇది లీగలా ఇల్లీగలా?' ప్లీడరుగారు సిగరెట్టు బొడ్డు దులిపారు. ముత్యాల మతాబాలా సిగరెట్టు కాలుతోంది! క్లబ్బులోపల పేకాట జోరుగా సాగుతున్నది. రూపాయలు ఖంగ్ ఖంగ్ మంటు న్నాయి. పింగ్‌పాంగాడుతున్న డాక్టరుగారు "ఖగపతి యమృతము తేగా...."అంటూ పాడుతూ ప్లీడరు గార్దగ్గరకొచ్చి "తర్వాతేమిటోయ్?" అన్నారు.

"ఏమైతేనేంలే....పొగతాగనివాడు దున్నపోతై పుట్టున్."

"ఏదీ వో చుట్ట!"

"అంత భాగ్యవాఁ ?"

"పెద్ద చిక్కే."

"పైడితల్లి రాగానే అనుకున్నాను. ఈ ఊరికి బ్రహ్మప్రళయం తప్పదని". ప్లీడరుగారు ఎక్స్పర్ట్ డిక్రీ ఇచ్చినట్లు నవ్వాడు. ప్లీడరుగారూ, పైడితల్లీ ఒక గ్రామస్తులు! చిన్నప్పుడు ఇద్దరూ వీధిబళ్ళో చదువుకున్నారు. ఆ సంగతి పైడితల్లి పైకి చెప్పుకుంటాడు. కాని ప్లీడరుగారు మరచిపోయినట్టు వాణ్ని పలకరించమన్నా పలకరించరు!

పైడితల్లి చిన్నప్పట్నుంచీ రణరాలుగాయి. అంత చలి వేసేదా పొద్దున్న

పొలాలమ్మట తిరిగేవాడు. భోగిమంట వేసేవాడు. ఊరికంతా వాడిదే పెద్ద మంట! బాపనవీధి కుర్రాళ్ళ నందర్నీ లేవగొట్టి తెల్లవారు జామున పొలాల్లో కాలవలకున్న వంతెనల్ని మోసుకొచ్చేవాడు. ఊళ్ళో తలుపులూ, తడికెలూ అన్నీ వాడివే! గోడలకి చరచిన పిడకలన్నీ భోగిమంటల పాలు. ఎంత తిట్టుకున్నా 'తిట్లన్నీ గాడ్దేవుడి'కని పైడితల్లి ఖాతరు చేసేవాడు కాదు. పైడితల్లిని చూస్తే కుర్రాళ్ళందరికీ పెద్ద పండుగే. దివాణప్పెరడు గోడ దూకి ఇంటిమీంచి ఉడుంలాగ జర్రున జారి నారింజకాయలు అంచీల మీదందిస్తే కుర్రాళ్ళంతా మంటి పుక్కటాల్లాగ తొనలకి సున్నం రాసుకుని తినేవారు. పైవీధి కుర్రాళ్ళు తన వీధి కుర్రాళ్ళ నేవన్నా అన్నారా, ఆటల్లో వీపు చిట్లగొట్టేశాడన్న మాటే!

తన స్నేహితులంతా చదువుకుని ఉద్యోగాలు చేసుకుంటూంటే తాను చుట్ల కొట్లో పడి కొట్టుకుంటున్నాడు. ప్లీడరుగార్ని చూసి ఇప్పుడనుకుంటూ వుంటాడు. 'నాను సదుగుకుంటేనా' అని. కాని వాడెప్పుడయినా చదువుతేనా? చదివినా 'అబ్బే! అంతేశి సదుగులికి సొమ్మెక్కడ పెగులుద్ది'.

బంతి చెట్లుకి నీళ్ళు పోయమని, పాదులకి గొప్పులు తవ్వమని మాస్టారు పురమాయింపు. 'పొట్లకాయల్కి రాళ్ళు కట్టేశేదేటి!' అని ఇచ్చకం చేసేవాడు పైడితల్లి. పుస్తకంలో నెమలికన్ను పెట్టి అది ఎన్నెన్ని పిల్లల్ని పెట్టిందో అస్తస్త మానూ చూసుకుంటూండడవేఁ వాడి చదువు! 'కాపోడికి సదువేట'ని పైడితల్లిని పన్లో పెట్టాడు తండ్రి.

పెళ్ళయాక మగాళ్ళకి బుద్ధులొస్తాయి కాబోలును! 'పెళ్ళిపీటల మీద కూకున్న సర్దా ఇప్పుడు నేదురా!'

చుట్టల పన్లోకెళ్ళి రోజుకో అర్ధరూపాయి డబ్బులు సంపాదించి భార్య చేతిలో పోస్తున్నాడు. ఈ పళంగా దోసిళ్ళ కొద్దీ సంపాదించి పెళ్ళాం వొళ్ళో గుమ్మరించా లని వాడికీ వుంది మనసు. కాని ఎంత పనిచేస్తోన్నా యజమాని వంద చుట్లకీ అణా పరకా కూలీ ఇస్తూంటే ఏం సరిపోయింది? వందకీ ఏడ్డబ్బులు 'కూలియ్యవయ్యా' అంటే 'ఛసేసి! ఫోఫో!' అని షాహుకారు గదమాయించాడు.

పైడితల్లి ఎన్నోసార్లు కూలి ఎక్కువ ఇమ్మని అడిగేడు. 'ఏట్రో నన్ను రూకాయిత్తన్నా'వని షాహుకారు గుడ్లురిమాడు. పైడితల్లి సంఘం పెట్టాడు. కాకినాళ్ళో సంఘం వుందని దొంగ నా కొడుకిక్కడా నెగదీసేసినాడ'ని చెయి జేసు కోబోయాడు. కూలివాళ్ళందర్నీ కూడకట్టుకుని పైడితల్లి పనులు మానిపించాడు. పొద్దస్తమానం వంచిన తలెత్తకుండా చుట్టలు చుట్టినా కడుపుకి చాలని కూలి! 'ఆకలి మా సెడ్డదిరా! పేదోడింట్లోనే పుడద్ది!'

ఆకలి పేదవాళ్ళ బొట్టె. పెళ్ళి కాని పిల్లలా పేదోడింట్లోనే వుండిపోతుంది. పైడితల్లి ఎంత పని చేసినా ఆకలి తీరదు. 'కూలెక్కువిచ్చినా మీ ఆకలి తీరదు

పోరా' అన్నాడు షాహుకారు. 'ఎంత పన్చేసినా నువ్విచ్చే కూలి వంద కణా పరకా, ఇదేటి అన్నేయం?'

'వంద చుట్టలు చుట్టడమంటే మజాకాలా - బాగా సార్వీసున్న పనివాడైతే రోజుకీ వెయ్యికి పైగా చుట్ట చుడతాడు. కానీ పని మా యమయాతన! ముసిలాడి వెన్నుపూస వంగిపోయి బాణా కఱ్ఱ లాగయిపోయింది. రూపాయి డబ్బుల సంపాదనలో పావలా డబ్బులు 'ఉడుకునీళ్ళకీ', మిగతా ముచ్చావకలోనూ పావలా డబ్బులు కల్లు నీళ్ళకీ. ఇంకింటికొచ్చేది పావలా డబ్బులు! పావలా డబ్బుల్తో నా నేటి సేత్తాసు సంసారం! మాయముండ సంసారం!' అని పైడితల్లి భార్య లబో దిబో మంటుంది. కల్లా, టీనీళ్ళా తాగకుంటా ఏ పనివాడూ పనిచేయలేడు. పైడితల్లి ఈ మాటెంత చెప్పినా వాడి భార్య వినదు!

పొగాకు గొట్రు కొడుతూంటే లగాడీగాడు బ్రహ్మంగారి పదాలు మాసిత్రంగా పాడతాడు. 'ఏమి జలమము ఏమి జలమమూ....' పాడుతూ తోక సన్నాలు గొప్ప విసురుగా చుడతాడు. రెక్కకి పదునెక్కించి ముసిలాడు చుట్టుకుపోతూంటే గాంధీ రాట్నం లాగ వాడి చెయ్యి గిరగిరా తిరిగిపోతూ వుంటుంది. వాటికిలాగ పైడితల్లి చెయ్యి తిరగందే! అంత గబగబా చుట్టినా ముసిలాడి సంసారం రోడ్డుమీదే!

షావుకారు చుట్టలంటే చుట్టుప్రక్కల గ్రామాలంతా పేరే! ఆదివారం సంత కొచ్చి ముందు చుట్టలు కొనుక్కుని తతిమ్మా సామాను తరవాత కొనుక్కుంటారు. ఊళ్ళోని చిల్లర దుకాణాలన్నీ షాహుకారు కొట్లో కాతా. చుట్టిన చుట్ట వొక గంటైనా నిలవుండదు. నిలవ సరుకయితే కొట్టు గొప్పే లేదు. చుట్టంటే చుట్టా! నిల్చి పదునుగా కాలుతుంది. వెన్నముద్దలాటి తెల్లని బొడ్డును రాలుస్తుంది. 'మిలిట్రీవోళ్ళు మన సుట్ట కాల్చందే తుపాకీ కాల్సీవోరటయ్యా!' అని షాహుకారు బేరగాళ్ళతో వెటకారాలాడుతున్నాడు. లెక్చరర్‌గారు 'నీ చుట్ట కాలిస్తే నాలుగు గ్లాసులు మంచి నీళ్ళ తాగాలయ్యోయ్' అని రిమార్కు లిస్తున్నారు. ప్లీడరుగారు 'నీ చుట్ట రుచి మరిగితే చర్చిల్ ఇండియాకి స్వతంత్ర మిమ్మంటాడయ్యా' అని వొకటే వేళాకోళం!

షాహుకారు గల్లాపెట్టె గజ్జెల మొలతాడు లాగ డబ్బులతో ఘల్ ఘల్ మంటున్నది.

అయినా కూలోడింకో అర్ధణా డబ్బు లిమ్మంటే షాహుకారుకి కష్టంగా వుంది. కష్టమని కాదు గాని కూలోళ్ళడిగింది ఇచ్చేస్తే ఎంత నామోషిక! ఇవాళిదయితే రేపింకోటి!

కాని నాలుగు రోజులై వచ్చే లాభం నిష్కారణంగా పోతోందని షాహుకారుకి దుఃఖంగానే వుంది. పైకి మాత్రం మేకపోతు గాంభీర్యంగా 'ఇంకెన్నాళ్ళ పస్లు మాన్తారో నానూ సూత్తాను. తల్లి పుట్టిల్లు మేనమామ[illegible]!'

షాహుకారన్నట్టు పనివాళ్ళకి కష్టంగానే వుంది. నాలుగు రోజుల్నించి దినం

గడవడం గండంగానే వుంది. సమ్మెవల్ల ఊళ్ళోన్నూ ఇబ్బందే. కూలోళ్ళకి కష్టవే, షాహుకారికీ నష్టవే. అయినా సరే షాహుకారు అర్ధణా డబ్బులిస్తాననడు! పోనీ ఊళ్ళోవాళ్ళయినా 'నీ లాభంలో వో అర్ధణా పోతేనేం గాక!' అనరు.

ఊళ్ళో పొగాకు చుట్టలు అర్ధణాకి మూడమ్ముతున్నారు. దవడ పీకితే సగం సగం కాల్చి పారేసి లెక్చరరుగారు 'రెక్కాడితే గాని డొక్కాడదు మీ కూలి పీనుగు లకి! పన్లోకి పొండ'ని హెచ్చరించారు. 'మా కూలోళ్ళకి రెక్కాడినా డొక్కాడదు' అన్నాడు పైడితల్లి. 'ఈ భూప్రపంచమంతా వో చుట్ట చుట్టినట్లు చుట్టేయాల్నుందిరా మీకూ వాళ్ళకీ' అన్నారు ప్లీడరుగారు.

ఊరేగింపులు, సభలు సాగిపోతూనే వున్నాయి. సభల్లోకి ఏం జరుగుతుందో చూద్దామని షాహుకారు మనుష్యులు వస్తూనే వున్నారు. లాభం మాట తల్చుకుని షాహుకారు బిక్క మొహం పేశాడు. కూలి లేక ముసిలాడు గిజగిజ తన్నుకు పోతు న్నాడు. తాగడానికి డబ్బుల్లేక 'ఏపే సెటకారీ పన'ని పైడితల్లి మీద కారాలూ మిరి యాలూ నూరుతున్నాడు. పైడితల్లి 'నాను మీ అందరి అభిమతవూ కనుక్కొని మరీ అడిగినాను.'

'మా యిట్టం పెకారం నువ్వు నడుసుకుంటే పన్లోకి పదరా' ముసిలాడురి మాడు.

'సొగం మందెస్లి సొగం మిగిలిపోతే కానా ద్రోహం జరిగిపోతాది!'

'అంతా ఎళ్ళిపోడమే మందు!'

'ఎందుకేస్సంత తొంద్రా! నాల్రోజు లూరుకుంటే వొందకి బేడా ఆడే ఇత్తాడు పుచ్చిన కుక్కలాగ.'

'తొందరెందుకంటావేటోయ్? సస్తా పుంటేను.'

పైడితల్లి కేమీ పాలుపోలేదు. షాహుకారు మనుష్యులు కూలివాళ్ళ వెంట నీడ ల్లాగ తిరుగుతున్నారు. ఇవన్నీ విని షాహుకారు మరింత కొమ్మమీదికి పాకి కోతిలా కూచుంటాడు. కొమ్మమీదున్న కోతిని దించటం మాటలా?

ముసిలాడికీ వాళ్ళకీ 'తాగడానికి డబ్బులిస్తాను రమ్మన' మని పాతికమందిని పనుల్లోకి తీసుకుపోయాడు. పండుగలికి ఈనాము లిస్తానని ఆశపెట్టి కూలీలను లాగు తున్నాడు. నాలుగు రోజుల్లో పన్లోకి అంతా వెళ్ళిపోతారు. అంతా వెళ్ళిపోతే తనూ వెళ్ళాలి. ఊళ్లో పదిమందీ చప్పట్లు కొడతారు. అణా పరక కూలే కలకాలవూ షాహుకారిస్తానంటాడు!

గుల్లసున్నంలో నీళ్ళు పోస్తే ఉడికినట్టు పైడితల్లి కుతకుతమన్నాడు. 'ఈ ఏల ఎట్టినా రేప తిట్టినా షాహుకారేన్రా' అని షాహుకారు మనుష్యులు కూలాళ్ళకి చెపుతున్నారు. 'అదికాదు పేసీ! నాకు సాల్దని అడిగితే ఆ మారాజే ఇత్తాడు. పైడితల్లి గోడి మాటిని స్ట్రయికేటని?' షాహుకారు మనుష్యులు నచ్చచెబుతున్నారు. సైకిలేసు

కుని రెండు మూడుసార్లు పోలీసాయన పైడితల్లి వీధికొచ్చి కొందర్ని భయపెట్టేడు!

చుట్ట కాల్చుకుంటూ పైడితల్లి వీధమ్మట పెడుతూంటే బాపనాయనికి వీధరుగు మీద గడ్డం గీస్తూ గీసిన వెంట్రుకల్ని సబ్బునురగతో చేతికి పాముకుంటూ 'మా గొప్ప ష్ట్రైయికు సేయించేసినా వయ్యోయ్! అమల్దారీ జరిపేస్తున్నా వమల్దారీ!' మంగలి మంత్రి నవ్వేడు. బాపనాయన అద్దంలో మీసం చూసుకుంటూ, 'వంకరగా కత్తిరించావురా మీసం' అన్నాడు. మంత్రి మాటలు విని పైడితల్లి కేసి తిరిగి చూసి పెదెం విరిచాడు. పైడితల్లి మనసుకు కత్తిగంటు పెట్టినట్లయింది. నొచ్చుకున్నాడు. పక్కసందులోంచి వాడి భార్య తవుగోల పట్టుకుని వస్తూ పైడితల్లిని చూసి ఆగింది, ఆగింది పూరుకోక అడిగింది 'ఇంకెన్నాళ్ళీ గొడబా?'

పైడితల్లి చుట్ట కాలుస్తూ ఆగిపోయాడు. చుట్ట కాలుస్తున్న వాడివంక దేబిగా చూస్తుంటే కాలుస్తోన్న చుట్టపీక అందించాడు. సుట్టంటే మా సెడ్డ కుతీ. అడ్డపొగ పెట్టి ఊరవతల పొలాల్లోకి గడ్డి తవ్వడం కోసం నడుస్తోంది.

'అవసరం పడింది. మాపిటికి మా సెల్లెల్నడిగి నానుకోళ్ళ పత్రాయే' అన్నాడు.

'ఎందుకురోయ్-డబ్బు పాపిట్టీ.'

'యేపారం ఎడతాను.'

'ఏ యాపారం?'

'ఏవో యాపారం-బతకద్దా?'

అలాగే తెస్తానన్నట్టు బుర్ర ఊపి వాడి భార్య చింతచెట్టు నీడల్లోంచి రైలు రోడ్డు ఎక్కింది. పైడీతల్లి తాను పెట్టబోయే వ్యాపారం గురించి ఆలోచిస్తున్నాడు. వీశ పుగాకు షాహుకారు మూడున్నరకి తెచ్చి తుక్కు పొత్తు కలిపి రూపాయన్నర లాభానికి చుట్టలమ్ముతున్నాడు. రోజుకీ ఏడెనిమిది చుట్టల పుగాకు చుడితే ఇంకా సరుకు సప్లయి లేదంటున్నారు. రోజుకీ షాహుకారికి ఎంత లాభం! ఇంటద్దె, కొట్టద్దె, నౌకరివాళ్ళ జీతం-ఇవన్నీ పోను సంసారం నిష్పూచీగా సాగుతున్నాది. చీటీలమీద వేసిన డబ్బుతో పొగాకు వ్యాపారం మొదలుపెట్టి ఎంత ఆస్తిపరుడ య్యాడు! చేతికి బంగారపు గొలుసూ, వాచీని!

పైడితల్లి పనివాళ్ళందరినీ పిలిచి రావిచెట్టు నీడని కూచోబెట్టాడు. సభలో షాహుకారు మనుషులూ వున్నారు. పుగాకు వ్యాపారం పైడితల్లి ఆరంభిస్తున్నాడని పుకారు! 'సూద్దాం! ఈడేపారస్తుడై పోనాడే!' అంటూ అరుగుమీద కూచున్నాడు మంగలి మంత్రి. 'గొప్ప సిత్రవే! అటు కూలోళ్ళకీ ఇటు షాహుకారికీ మా గొప్ప జెల్ల కొట్టేసినాడు.'

ఈసారి మునపటి షాహుకారులాగే పైడితల్లి వ్యాపారస్తుడౌతున్నాడు. కూలా ళ్ళకి హెచ్చు కూలిచ్చినా వాడికి లాభమే. ఇన్ని నీతులూ చెప్పి పైడితల్లి షాహు

కారుల్లో కలిసిపోతున్నాడు!

'లీడరు షిప్పును నమ్మలేమోయ్!' అంటూ లెక్చరరుగారు ఆర్థిక శాస్త్రాన్ని, మార్కెట్టునీ, రాజకీయాల్నీ తిట్టి తిట్టి పోశారు.

'అంతే అంతే! తీరా ఎక్కేం తర్వాత నిచ్చెన తన్నేస్తారు లీడర్లు' అన్నారు ప్లీడరుగారు.

పైడితల్లి కూలోళ్ళనందర్నీ పిలిచి తలా రెండ్రూపాయలూ చందా వేసుకోండన్నాడు. 'మొత్తం సొమ్ము మన్నికాదనుకొని పోకాదెడదాం' అన్నాడు. ఈ డబ్బుతో పుగాకు తెచ్చి చుట్టలు చుడదాం రమ్మన్నాడు. అమ్ముకుంటే వందకీ మూడణాలు కూలీ కిట్టగా అర్ధణాకీ వో చుట్ట హెచ్చు అమ్మొచ్చునన్నాడు. అలాగమ్మినా నెలకి నూటఏభై పైని లాభం వస్తుందని చెప్పేడు. అంతా కలిసి వో పెద్ద సాల వేసి లేబరు చుట్టలు అమ్ముదాం. తకర్లేని లెక్కలు వేశాడు. ఈసారి షాహుకారు పావలా ఇస్తానని పిల్చినా వెళ్ళక్కర్లేదు, లాభం ప్రతి ఏడూ అందరికీ సమానంగా పంచుకోవచ్చును!'

ఇప్పుడు ఊళ్లో చుట్టల కరువు లేదు. చవక! చవక! కారుచవక! అర్ధణాకి అయిదు! చుట్టలంటే చుట్టలా! లేబరు చుట్టలు!! లేబరు సుట్టలూ! సవకా సవకా' అని పైడితల్లి అమ్ముతూంటే సరుకు ఒక్క నిమిషమైనా నిలవ వుండదు! ఆదివారం సంతకొచ్చి పల్లెటి జనం తీరుబడిగా లేబరు చుట్టలు కొనుక్కుని పోతున్నారు. పూర్వపు షాహుకారు కమీషనుమీద లేబరు సంఘంలో కొనుక్కుని, లాభానికి చిల్లర దుకాణం పెట్టుకుని అమ్ముకుంటున్నాడు. వ్యాపారం మార్చి అల్యూమినం కొట్టు పెట్టినా చుట్టల వ్యవహారం అచ్చొచ్చిందని మాన్లేదు.

ముసిలాడు 'కూలాళ్ళ గొంతులో....' అని పదం పాడుతూ చుట్ట చుడుతుంటే చెయ్యి యంత్రంలాగ గిరగిరా తిరిగిపోతున్నాది.

లెక్చరరుగారు లేబరు చుట్ట అంటించి, 'ఇంత కారుచవగ్గా వీళ్ళెలా కిడుతున్నాయీ అని' అంటూ ఆర్థిక శాస్త్రాన్ని మనసులోనే దులుపుకుంటున్నారు. ప్లీడరుగారు రైలింజనులాగ గువ్వున గుప్పెడు పొగ వొదుల్తూ "నేనానాడే చెప్పాను పైడితల్లి ప్రళయం తీసుకొస్తాడని!" అన్నారు.

[అరసం-గుంటూరుజిల్లా శాఖ ప్రచురణ 'కథా స్రవంతి' మూడవ సంపుటం (1988) సౌజన్యంతో]


చదవండి ! సాహిత్యోద్యమ మాసపత్రిక చందాలు కట్టించండి !

ప్ర జా సా హి తి

నిర్వహణ : జనసాహితీ సాంస్కృతిక సమాఖ్య (ఆంధ్రప్రదేశ్)